క్లుప్తంగా

జాబ్‌మేళాలో 36 మంది ఎంపిక



ఎంపికైన యువకుడుకి ప్లేస్‌మెంట్ ధ్రువపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీరాములు

పాతపట్నం: పాతపట్నం ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి శాఖ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. నాలుగు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలకు 92 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వీరిలో నైపుణ్యం ఆధారంగా 36 మందిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీరాములు మాట్లాడుతూ.. పారిశ్రామిక అవసరాలు లక్ష్యంగా విద్యార్థులు ముందుకు సాగాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లో ఇంటర్వ్యూలు నిర్వహించడానికి కంపెనీలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.చక్రపతి, జిల్లా నాన్ టెక్నికల్ ఆఫీసర్ సాయిరాం, స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ పి.అనూష, అధ్యాపకులు పి.కామేశ్వరరావు ఉన్నారు.

విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి

- నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

సారవకోట: విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు సూచించారు. సారవకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల, సారవకోట, అలుదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు లీగల్ లిట్రసీ కార్యక్రమంలో భాగంగా చట్టాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. లైసెన్స్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులతో ఫోన్లో మాట్లాడటం, వీడియో కాల్స్ చేయడం చేయరాదని, ఈవిటీజింగ్ చేయరాదని, సైబర్ మోసాలలో చిక్కుకోకూడదని అవగాహన కల్పించారు. ఎస్‌ఐ అనీల్‌కుమార్, ఎంఈవో ఎంవీ రమణ, ప్రధానోపాధ్యాయులు తంప రామారావు ఉన్నారు.

19 నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు



మాట్లాడుతున్న ఎంఈవో రాంబాబు

హిరమండలం: మండల స్థాయి క్రీడా పోటీలను ఈనెల 19వ తేదీ నుంచి కల్లట కార్మెల్ ప్రైవేటు స్కూల్ ఆవరణలో నిర్వహించనున్నట్లు ఎంఈవో కె.రాంబాబు తెలిపారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో పీడీ, పీఈటీ, సీఆర్‌ఎంటీలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అండర్-14, అండర్-17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్ పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థుల వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్‌ఎంటీలు గోవిందరావు, చంద్రరావు ఉన్నారు.

ల్యాప్ టాప్‌లు అప్పగించాలని ఒత్తిడి వద్దు

పొందూరు: వీసీఆర్ కార్యక్రమంలో భాగంగా నాలుగేళ్ల క్రితం విద్యార్థులకు అందించిన డెల్ కంపెనీ ల్యాప్ టాప్‌లను తిరిగి అప్పగించాలని ఒత్తిడి చేయడం తగదని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న, ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం ఈ ల్యాప్ టాప్‌లను పాఠశాలల్లో అనేక ఆన్‌లైన్ పనులకు హెచ్‌ఎంలు ఉపయోగిస్తున్నారన్నారు. ఉపయోగంలో ఉన్న వాటిని తిరిగి అప్పగించాలని హెచ్‌ఎంలపై ఒత్తిడి చేయడం సమంజసం కాదని అన్నారు. రెండు నెలలుగా ఎటువంటి నిధులు మంజూరు చేయకపోగా అవసరాలకు ఉపయోగపడుతూ వినియోగంలో ఉన్న వాటిని అందుబాటులో లేకుండా చేయడం తగదని అన్నారు. చాలా పాఠశాలల్లో సొంత ఖర్చులతో ప్రింటర్‌లను కూడా సమకూర్చుకొని జాగ్రత్తగా వాడకం చేస్తుండగా అర్ధాంతరంగా తిరిగి అప్పగించాలని చెప్పడంలో అర్థం లేదన్నారు. ల్యాప్‌టాప్‌లను తిరిగి అప్పగించాలనే అధికారుల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఉచితంగా గ్యాస్ స్టౌల పరిశీలన

నరసన్నపేట: హెచ్‌పీ గ్యాస్ వినియోగదారులకు ఉచితంగా కంపెనీ సేఫ్టీ చెక్ చేయిస్తుందని వినియోగించుకోవాలని ఏరియా సేల్స్ మేనేజర్ కె.శ్రీహర్ష అన్నారు. స్థానిక గ్యాస్ ఏజెన్సీలో ఉన్న సిబ్బంది వినియోగదారుల ఇంటికి వస్తున్నప్పుడు బాధ్యతగా చెక్ చేయించుకోవాలని కోరారు. శుక్రవారం ఆయన నరసన్నపేటలో పలు ఇళ్లకు వెళ్లి సేఫ్టీచెక్ జరుగుతున్న తీరును పరిశీలించారు. పైపు ఎలా ఉంది. బర్నర్లు పనితీరుతో పాటు స్టౌ, సిలిండర్‌కు సంబంధించి అన్నింటినీ చెక్ చేస్తారన్నారు. వినియోగదారులు డిజిటల్ పేమెంట్‌ల గురించి అవగాహన పొందలన్నారు.



● లడ్డూ @ 101 కిలోలు

జలుమూరు మండలం శ్రీముఖలింగం మార్కెట్ వీధిలో ఏర్పాటు చేసిన గణపతికి పూజలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గ్రామానికి చెందిన తర్ర లింగమూర్తి 101 కిలోల లడ్డూను ప్రసాదంగా శుక్రవారం అందజేశారు. నవరాత్రులు అనంతరం లడ్డూను వేలం వేసి భక్తులకు అందచేయనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

-జలుమూరు

● నేత్ర పరీక్షలు



బూర్జ మండలం మామిడివలస జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు శుక్రవారం నేత్ర పరీక్షలు చేశారు. 55 మందికి పరీక్షలు చేసినట్టు ఆప్తాల్మిక్ అధికారి డి.ప్రతాప్ తెలిపారు. వీరిలో ఐదుగురు కంటి సమస్యతో బాధపడుతున్నట్టు గుర్తించినట్టు చెప్పారు. బూర్జ పీహెచ్‌సీ సీహెచ్‌వో కె.అప్పలస్వామి, హెచ్ ఎం ఎం.అనిత, ఏఎన్‌ఎం బి.లలిత, ఎంఎల్‌హెచ్‌పీ కె.అలేఖ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

-బూర్జ

● దుస్తులు వితరణ

కొత్తూరు మండలం కర్లెమ్మ గ్రామంలో పేదలకు దుస్తులు పంపిణీ శుక్రవారం జరిగింది. ఎద్దు సుందరనారాయణ వరహాలమ్మ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ గోపాలదాసు నాయుడు, సర్పంచ్ లోతుగెడ్డ భగవాన్ నాయుడులు దుస్తులు అందజేశారు. గోపాలదాసు నాయుడు తన తండ్రి జ్ఞాపకార్థం ట్రస్టు తరఫున దుస్తులతో పాటు నగదును పంపిణీ చేసినట్లు చెప్పారు.

-కొత్తూరు



భయం.. భయం!



కోతకు గురవుతున్న గట్టును చూపిస్తున్న రైతులు

- వంశధార నది గట్టుకు కోత
- గండి పడేందుకు అవకాశం
- ఆందోళనలో కొండరాగోలు, దుర్భలాపురం వాసులు



నది గట్టును తాకుతూ ప్రవహిస్తున్న వరద

హిరమండలం: వర్షాలు వచ్చాయంటే ఆ గ్రామాల ప్రజలు బితుకుబితుకుమంటూ గడపాల్సిందే. ఎప్పుడు వంశధార నీరు వచ్చి గ్రామాల మీద పడుతుండోనని ఆందోళన చెందాల్సిందే. ఏటా నది గట్టు కోతకు గురవుతున్నా ప్రభుత్వాలు శాశ్వత చర్యలు చేపట్టకపోవడంతో ప్రతి క్షణం భయం భయంగా గడుపుతున్నారు హిరమండలం మండలంలోని కొండరాగోలు, దుర్భలాపురం గ్రామాల ప్రజలు. ఈ గ్రామాలు వంశధార నది చెంతనే ఉన్నాయి. ముఖ్యంగా గులుమూరు గ్రామసమీపంలోని రాజుగారి తోట నుంచి దుర్గమ్మ గుడి వరకూ దాదాపు కిలోమీటరు మేర నది గట్టు కోతకు గురవుతోంది. ఈ గట్టుకు రాతిపేర్పుడు ఉండేది. రాతిపేర్పునకు అనుసరించి భారీ మట్టిదిబ్బలు రక్షణ కవచంలా ఉండేవి. కానీ భారీ వరదలకు మట్టిదిబ్బలు కరిగిపోయాయి రాతిపేర్పుడు దెబ్బతింది. దీంతో ఇక్కడ పరిస్థితి ప్రమాదకరంగా మారింది. మొన్నటి వరదలకు నది ప్రమాదకర స్థితిలో ప్రవహించింది. గండి పడుతుందన్న ఆందోళనతో పగలూ రాత్రీ తేడా లేకుండా రెండు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక వేళ గండిపడితే ఆ రెండు గ్రామాల ప్రజలకు ముప్పు తప్పదు. మరోవైపు గలుమూరు, కొండరాగోలు, దుర్భలాపురం గ్రామాలకు చెందిన సుమారు 800 ఎకరాల వరి పంట ముంపు బారిన పడే అవకాశముంది. అయితే చెంతనే గొట్టా బ్యారేజీ ఉండడం, వర్షాకాలం వరదలు వచ్చురోజుల్లో గట్టు నుంచి చెమ్మ వస్తుండడంతో దుర్భలాపురం గ్రామస్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అలాగే ఖరీఫ్ సీజన్‌లో గ్రామం పక్కనుంచి కుడి ప్రధాన కాలువ ద్వారా నీటి ప్రవాహం ఉండటంతో పాటు రబీలో రిజర్వాయర్ నుంచి కుడికాలువ ద్వారా బ్యారేజీలోకి రావడంతో పంట పొలాల్లో నిత్యం నీరు ఉంటుంది. దీంతో పంట దిగుబడులు తక్కువగా వస్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టిపెట్టి వంశధార నది గట్టుకు రక్షణ గోడ నిర్మించాలని రెండు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ముప్పు తప్పదు



వంశధార నది గట్టు కోతకు గురవుతుంది. ముందస్తు చర్యలు తీసుకోకుంటే గండి పడి కొండరాగోలు, దుర్భలాపురం గ్రామాలకు ముంపు ప్రమాదం పొంచిఉంది. ఇప్పటికే గట్టు రాతి పేర్పు వరదకు కొట్టుకుపోయింది. ఈసారి వరదవస్తే గండిపడే అవకాశం ఉంది. ఉన్నతాధికారులు దృష్టి సారించి ముందస్తుచర్యలు తీసుకోవాలి

-వరుదు కన్నయ్య, రైతు, కొండరాగోలు

గండి కొడితే భారీ నష్టమే..



పెద్ద వరదలు వస్తే వంశధార నది గట్టుకు గండి పడే అవకాశం ఉంది. గండిపడితే రెండు గ్రామాలతో పాటు 800 ఎకరాల వరకు పంట భూములు నీటమునిగిపోయే అవకాశం ఉంది. గట్టుకు రక్షణ గోడ నిర్మంచాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

-ఉంగటి గోవిందరావు, రైతు, కొండరాగోలు

కూటమి పాలనలో రైతులకు అన్యాయం

- మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



ఎల్.ఎన్.పేట: ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత రాష్ట్రంలో రైతన్నలకు కష్టాలు ప్రారంభం అయ్యాయని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టిన మొదటి ఏడాదిలోనే రైతులకు సరిపడా విత్తనాలు, ఎరువులు ఇవ్వలేని దుస్థితి నెలకొందని పేర్కొన్నారు. విత్తనాలు, ఎరువులు ప్రైవేటు డీలర్ల వద్ద అధిక ధరలకు రైతులు కొనుగోలు చేసుకున్నారని వివరించారు. రైతులంటే చంద్రబాబకు ఎప్పుడూ చులకన భావమేనని ఆరోపించారు. గతరంలో కూడా వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు మాటలను గుర్తు చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల ఇంటి వద్దకే విత్తనాలు, ఎరువులు వారికి కావలసినంతగా సరఫరా చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం రైతులకు పెట్టుబడి సాయం అందివ్వలేని దుస్థితి నెలకొందన్నారు. రైతు భరోసా పేరుతో సాగు సీజన్ ప్రారంభానికి ముందే జగనన్న ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించిందన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలకు పైగా గడుస్తున్నప్పటికీ చంద్రబాబు ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని ఎందుకు వర్తింపచేయటం లేదని నిలదీశారు. రైతులు పండించే పంటలకు ఈక్రాప్ నమోదు ప్రక్రియ సెప్టెంబర్ 15వ తేదీ నాటికి పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందన్నారు. గతంలో ఎప్పుడు సకాలంలో ఈ-క్రాప్ నమోదు పూర్తయ్యేదని వివరించారు. రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న చంద్రబాబు తీరు మార్చుకోవాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఒకటైన అన్నదాత సుఖీభవ పథకాన్ని తక్షణమే వర్తింప చేయాలని డిమాండ్ చేశారు.

గణపయ్యకు కుంకుమార్చనలు

వినాయక నవరాత్రులు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఏడో రోజైన శుక్రవారం ఉత్సవ మండపాల వద్ద కుంకుమ పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అధికసంఖ్యలో మహిళలు పాల్గొని పూజలు చేశారు. అలాగే కొన్నిచోట్ల కమిటీ సభ్యులు భక్తులకు అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు. పలు గ్రామాల్లో దీపోత్సవం జరిగింది.



సారవకోట: అలుదులో పూజలు చేస్తున్న మహిళలు



పాతపట్నం: సీతారాంపల్లిలో అన్నప్రసాదాన్ని వితరం చేస్తున్న దృశ్యం



ఆమదాలవలస: మోనింగివారివీధి భవిత స్కూల్ ఆవరణలో అన్న సమారాధనలో భక్తులు



నరసన్నపేట: తమ్మయ్యపేటలో దీపాలంకరణలో మహిళా భక్తులు

కృష్ణదాస్ పరామర్శ



పాతపట్నం: నిరంజన్ పట్నాయక్‌ను పరామర్శిస్తున్న మామిడి శ్రీకాంత్



జలుమూరు: సర్పంచ్ సతీష్‌ను ఓదార్చుతున్న కృష్ణదాస్ తదితరులు

జలుమూరు: శ్రీముఖలింగం సర్పంచ్ తమ్మన్నగారి సతీష్‌కుమార్ మాతృమూర్తి ఇందుమతి ఇటీవల మృతి చెందారు. దీంతో ఆ కుటుంబాన్ని మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ శుక్రవారం పరామర్శించారు. మృతికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఇంటి పెద్ద కోల్పోవడం బాధాకరమని ఓదార్చారు. పరామర్శించిన వారిలో డీసీసీబీ మాజీ అధ్యక్షుడు కరిమి రాజేశ్వరరావు, ఎంపీపీ వాన గోపి, మాజీ ఎంపీపీ బగ్గు రామకృష్ణ, పోలాకి, జలుమూరు మండల సలహాదారులు ముద్దాడ బైరాగినాయుడు, పైడి విఠలరావు, స్థానిక ఎంపీటీసీ సభ్యుడు కె.హరిప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు పంచిరెడ్డి రాజారావు, విజయ్, బోర రామకృష్ణ ఉన్నారు.

పాతపట్నం: పాతపట్నం దుర్గమ్మగుడికు చెందిన తొనంగి సుధాకర్ పట్నాయక్ ఇటీవల మృతి చెందాడు. అ కుటుంబాన్ని రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ మామిడి శ్రీకాంత్ శుక్రవారం పరామర్శించారు. మృతి గల కారణాలను ఆయన సోదరుడు నీరంజన్ పట్నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే చిన్నలొగిడి గ్రామానికి చెందిన సురేష్ సోయి మృతి చెందడంతో అతని కుటుంబాన్ని కూడా పరామర్శించారు. సీది గ్రామానికి చెందిన రావాడ అప్పన్నమ్మకు ఇటీవల కాళ్లకు గాయలాయ్యాయి. మామిడి శ్రీకాంత్ సీది గ్రామం అప్పన్నమ్మ ఇంటికి వెళ్లి పరామర్శించి, త్వరగా కొలుకొవాలని ఆయన కోరారు. ఆయనతో పాటు డకర చిన్నారావు, నాగరాజు, రమణ, నారాయణరెడ్డిలు పాల్గొన్నారు.

వసతిగృహ నిర్మాణాలకు స్థల పరిశీలన



గొట్టలక్ష్మీపురం వద్ద స్థల పరిశీలన చేస్తున్న డీఈవో తిరుమల చైతన్య తదితరులు

హిరమండలం: మండలానికి మంజూరైన పీఎం జన్మన్ వసతిగృహ నిర్మాణానికి స్థలసేకరణ పూర్తిచేసినట్లు మండల విద్యాశాఖ అధికారి కె.రాంబాబు తెలిపారు. డీఈవో ఎస్.తిరుమల చైతన్య, సమగ్ర శిక్షా ఏఈ బుచ్చిబాబుతో కలసి గొట్టలక్ష్మీపురం సమీపంలోని స్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. మండలంలోని సుభలయ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, సీది గ్రామాలకు రెండు వసతి గృహాలు మంజూరయ్యావన్నారు. అయితే ఆయా గ్రామాల్లో భూసేకరణ చేసేందుకు ప్రభుత్వ భూమి లేకపోవడంతో ఆర్ అండ్‌ఆర్ కాలనీకు సంబంధించి గులుమూరు రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ స్థలాన్ని కేటాయించామని చెప్పారు. అలాగే సీది గ్రామానికి మంజూరైన వసతి గృహానికి సంబంధించి గొడియపాడు రెవెన్యూ పరిధిలోని గొట్టలక్ష్మీపురం వద్ద ప్రభుత్వ భూమిని గుర్తించి స్థలసేకరణ చేసినట్లు పేర్కొన్నారు. రెండు వసతి గృహాలకు సంబంధించి స్థలసేకరణ పూర్తిచేశామన్నారు. అడ్మిస్ట్రేటివ్ మంజూరు కూడా అయినట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్యాలరావు, సీఆర్‌ఎంటీ గోవిందరావు, చంద్రరావు, ఎమ్మార్సీ సిబ్బంది ఉన్నారు.

సర్దుబాటు పేరుతో పాఠశాలలకు మంగళం

- ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణమూర్తి



మాట్లాడుతున్న ఎస్.వి.రమణమూర్తి

ఆమదాలవలస: పని సర్దుబాటు పేరిట ప్రాథమికోన్నత పాఠశాలలకు మంగళం పాడేటట్లు ప్రభుత్వ చర్యలున్నాయని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు ఎస్.వి.రమణమూర్తి అన్నారు. తొగరాం పాఠశాలలో ఉపాధ్యాయులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎక్కువ మంది విద్యార్థులుంటే ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలగా ఉన్నతీకరించడం చేయాలని.. లేని పక్షంలో అలాగే ప్రాథమికోన్నత పాఠశాలగా కొనసాగించాల్సి ఉందన్నారు. అయితే అందుకు విరుద్ధంగా విద్యార్థుల సంఖ్య తగ్గారన్న కారణంతో గతంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలోని బోధన సహాయకులను తొలగించారని అన్నారు. ఇప్పుడు సర్దుబాటు పేరిట ఉన్న భాషా పండిట్లను కూడా వేరే పాఠశాలలకు కేటాయిస్తే అక్కడ ఉన్న ప్రాథమికోన్నత తరగతుల విద్యార్థుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. విద్యార్థులకు హిందీ, తెలుగు భాషలు బోధించేవారు ఎవరని అన్నారు. రానున్న విద్యా సంవత్సరంలో 6, 7, 8 తరగతులలో విద్యార్థులు చేరుతారా అనే అనుమానాన్ని వ్యక్తం చేశారు. ఈ దుస్థితికి అధికారులు సమాధానం చెప్పాలన్నారు. అధికారులు నిర్వాకం చూస్తుంటే రానున్న విద్యా సంవత్సరంలో ప్రాథమికోన్నత పాఠశాలలను మూసి వేసే ఆలోచనలో ఉన్నట్లు కనబడుతోందన్నారు. ప్రభుత్వం మాధ్యమంపై స్పష్టత ఇవ్వకపోవడం పదో తరగతి విద్యార్థుల పట్ల శాపంగా మారే అవకాశం ఉందన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నాలుగో నెల గడుస్తున్నా బోధన మాధ్యమంపై ఎటూ తేల్చకపోవడం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులపై వారికున్న శ్రద్ధ ఏపాటిదో అర్థం అవుతుందని అన్నారు. పురపాలక పాఠశాలల్లో వెంటనే బదిలీలు, పదోన్నతలు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎస్టీయూ మండల నాయకులు రమేష్, రమణమూర్తి, రామచంద్ర ఉన్నారు.

ఏచూరి మరణం తీరనిలోటు



కొత్తూరు: సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆమదాలవలస: కమ్యూనిస్టు యోధుడు కామ్రేడ్ సీతారాం ఏచూరి మరణం కార్మిక.. కర్షక వర్గాలకు తీరనిలోటని సీపీఎం సీనియర్ నాయకులు బొడ్డేపల్లి మోహనరావు అన్నారు. పట్టణంలోని ఆయన స్వగృహం వద్ద సీతారాం చిత్రపటానికి శుక్రవారం పూలమాలవేసి నివాళులర్పించారు. 1981-83 సంవత్సరాల మధ్య ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శిగా తాను పని చేస్తున్న కాలంలో సీతారాం ఏచూరి ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ నాయకుడుగా పని చేశారని గుర్తు చేశారు. ఆయన మృతి కార్మిక కర్షక వర్గాలకు తీరని లోటని అన్నారు.

కొత్తూరు: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి తీరని లోటని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు, న్యాయవాది ఎం.అప్పారావు అన్నారు. కొత్తూరులో సీతారాం ఏచూరి సంస్మరణ సభను శుక్రవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం నాయకులు ఎస్.అప్పన్న, దుర్గారావు, అప్పారావు, రమేష్ చిన్నారు, త్రినాథరావు ఉన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సుధావాణి

హిరమండలం: గర్భిణులు, బాలింతలు పోషకాహారాన్ని తీసుకోవడం ద్వారా రక్తహీనతను అధిగమించవచ్చుని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.సుధావాణి అన్నారు. హిరమండలం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పోషకాహార మాసోత్సవాలను నౌగూడ కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. మనం అందించే ఆహారంపైనే పిల్లల ఎదుగుదల ఆధారపడి ఉంటుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేసే పౌష్టికాహారంతో పాటు చిరుధాన్యాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎం.చిన్నమ్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వై.ఈశ్వరమ్మ, ఎల్.శాంతికుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, గర్భిణులు, బాలింతలు, కిశోర్ బాలికలు ఉన్నారు.

సంక్షిప్తంగా..

ఘనంగా హిందీ దివస్



కొత్తూరు: కడుము జెడ్పీ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయిని సౌజన్యవతి సత్కరిస్తున్న దృశ్యం

కొత్తూరు: కొత్తూరు, పాతపానుటూరు, కడుము ఉన్నత పాఠశాలల్లో ఆయా హెచ్‌ఎంల ఆధ్వర్యంలో హిందీ దివస్‌ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయిలో జూనియర్ విభాగంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని కాసిన సౌమ్యశ్రీ, సీనియర్ విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచిన లిఖితలను హెచ్‌ఎం గోవిందరావు, హిందీ ఉపాధ్యాయులు సీహెచ్ ఉమా, లుకలాపు శంకరావులు అభినందించారు. అలాగే కడుము పాఠశాలలో హెచ్‌ఎం బి.సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా హిందీ ఉపాధ్యాయిని సౌజన్యవతిని దుశ్శాలువతో సత్కరించారు. అలాగే పాతపానుటూరు పాఠశాల హెచ్ఎం కడుము తిరుమలరావు ఆధ్వర్యంలో హిందీ దివస్ జరిగింది.

మాత్రల పంపిణీని పర్యవేక్షించాలి

సరుబుజ్జిలి: ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ సమయంలో అధ్యాపకులు, వైద్యసిబ్బంది సక్రమంగా పర్యవేక్షణ చేయాలని ఎంపీడీవో పీవీ మురళీమోహన్‌కుమార్ అన్నారు. ఈనెల 17వ తేదీన ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి సంబంధించి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. హెచ్‌ఎంలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

హిరమండలం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించాలని ఎంఈవో కె.రాంబాబు సూచించారు. పాతహిరమండలం-2 ప్రాథమిక పాఠశాలను శుక్రవారం సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. హెచ్‌ఎం పి.లక్ష్మీనారాయణ ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకరించాలి

పాతపట్నం: పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం అభివృద్ధికి అందరూ సహకరించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. ఆలయం ఎదురుగా ఉన్న మామిడి తోటలో సీతారాంపల్లి గ్రామానికి చెందిన పద్మ లోకేశ్వరరావు సుమారు రూ.4 లక్షలతో భక్తులకు వంట చేసుకోవడానికి, ఉండడానికి చేపట్టిన రేకులషెడ్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఆలయ ఈవో టి.వాసుదేవరావు, పైల బాబ్జీ, అశోక్, గోపాల్, రమణ, ప్రభాకరరావు, సీతారాంపల్లి ఉన్నారు.

జీపీడీసీ అమలులో అశ్రద్ధ వద్దు

నరసన్నపేట: గ్రామ స్థాయిలో జీపీడీసీ అమలు పక్కాగా జరగాలని, మండల స్థాయి అధికారులు మానిటరింగ్ చేస్తుండాలని జిల్లా పరిశీలకులు కె.నాగరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రతీ పంచాయతీలో జీపీడీసీ ప్రణాళిక సిద్ధం చేయాలని.. దాని ప్రకారమే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. దీనిపై మండల స్థాయిలో ఉన్న ప్రతీ శాఖాధికారి తగిన చర్యలు తీసుకోవాలని, పంచాయతీ కార్యదర్శులకు తగిన సూచనలు చేయాలన్నారు. రిసోర్స్ పర్సన్ లోకనాథం జీపీడీసీ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఎంఈడీవో మధుసూదనరావు పాల్గొన్నారు.

పాతపట్నంలో భారీ వర్షం

పాతపట్నం: మండలంలో శుక్రవారం రాత్రి ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. పాతపట్నం మండల కేంద్రంలో సుమారు గంటన్నర పాటు ఏకధాటిగా పడిన వర్షంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రహదారున్నీ జలమయమయ్యాయి. అలాగే కొరసవాడ, కాగువాడ, పెద్దసీది, రొంపివలస గ్రామాల్లో కూడా భారీ వర్షం పడింది.

అలుదులో పారిశుద్ధ్య పనులు

సారవకోట: అలుదు గ్రామంలో శుక్రవారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. జాతీయ రహదారికి అనుకుని ఉన్న చెత్తకుప్పలను జేసీబీలతో తొలగించి ట్రాక్టర్లతో సుదూర ప్రాంతాలకు తరలించారు. అలాగే కాలువలో పూడికలను తొలగించే పనులను సర్పంచ్ సాగిపల్లి దండాశి, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణలు పర్యవేక్షించారు.